పెళ్ళి పందిరి చాలా సందడిగా వుంది.

సన్నాయీ, డోలూ మోగుతున్నాయి. ఆ సన్నాయి విద్వాంసుడి పిలక-రాగంతో బాటూ గమకంతోబాటూ గంతులేస్తోంది. డోలు మోగిస్తున్నవాడు సరేసరి... వీపు మీద కూడా ఎవరో వాయిస్తున్నట్టే కదిలిపోతున్నాడు. పదేళ్ళ కుర్రాడొకడు గుడ్డిగా శృతి పెట్టెతో సహకరిస్తున్నాడు. ఇదంతా వింతగా వుండి కొందరు కుర్రసన్నాసులు వాళ్ళచుట్టూ చేరారు.

ఓ లాగుడు బండి మీద పది పదిహేను కొబ్బరి మట్టలు పట్టించుకుని...వో నలుగురొచ్చేరు. ఆ కొబ్బరి కొమ్మలతో వివాహ వేదిక నిర్మిస్తారు వాళ్ళు. కొమ్మలే స్తంభాలూ, కొమ్మలే రూఫింగ్ ఆ వేదికకి... ఆ వేదికలోనే ఆ రోజు రాత్రి రెండు గంటల వలభై ఒక్క నిమిషానికి సుశీలా-రాంబాబుల వివాహం జరుగబోతూ వుంది.



# డామిట్

బండా శ్రీనివాసరావు

ఉదయం పది గంటల వేళ...

గ్రీటింగ్ టెలిగ్రామ్‌లు తెచ్చిచ్చిన పోస్ట్‌మాన్‌కి నాలుగైదు పెద్ద పెద్ద లడ్డూలు స్వయంగా ఏరి వో పాకెట్లో పెట్టి అందించి, పన్నని ఆత్రుతతో ఆ గ్రీటింగ్స్‌ని చదువుతున్నాడు రాంబాబు.

"మే హెవెన్స్ ఛాయిసెస్ట్ బ్లెస్సింగ్స్ బీ ఆన్ ది కపుల్..."

"మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే..."

"విష్‌యూ బోత్ ఎ హేపీ అండ్ ప్రాస్పరస్ వెడ్డెడ్ లైఫ్..." అంటూ వెనుక నుంచి వినబడిందో గ్రీటింగ్.

గిరుక్కున వెనుదిరిగిన రాంబాబుకి చిన్ననాటి మిత్రుడూ-అప్తుడూ అయిన రమేష్ నవ్వుతూ కనబడ్డాడు.

"హల్లో దుంబూ! బాగున్నావా-ఎంత సేపయింది వచ్చి?" అన్నాడు రాంబాబు ఆప్యాయంగా అతన్ని కౌగలించుకుని...

రాంబాబు కౌగిలి నుంచి విడిపించుకని-వినగూడని దేదో విన్నట్టు సీరియస్‌గా ముఖం పెట్టి- "నీ కోసంగతి తెలుసా?" అని ప్రశ్నించేడు రమేష్.

"ఏమిటి?"

"నేనేం చదువుతున్నాను?" అడిగేడు రమేష్.

"ఎం.బి.బి.ఎస్. ఫైనలియర్ కదా! ఏం- మానేసి బీసెంట్ రోడ్‌లో అత్తర్ల షాపేమైనా పెట్టావా?"

"అదేం లేదు కానీ, నేను కాబోయే డాక్టర్నని తెలిసి కూడా, నువ్వలా 'బాగున్నావా' అని అడగడం బాగోలేదు గురూ. ఆ మాత్రం నా బాగు నేను చూసుకోలేకపోతే- ఇంక నా చదువెందుకట! సర్లేగానీ- ఏవిటీ-లడ్డూలు పోస్ట్‌మాన్‌కి స్వయంగా తెచ్చి ఆప్యాయంగా అంటగడ్తున్నావ్-లవ్ లెటర్లేమైనా తెచ్చేడా!"

"ష్ వూర్కోరా బాబూ- మా మరదలు పిల్ల యిక్కడే వుంది. వింటంటే పందిరి పీకి చాకిరేవెట్ట గలదు" అంటూ అతన్ని ఇంట్లోకి తీసుకెళ్ళాడు రాంబాబు.

"చలపతిగారబ్బాయి కదూ- ఏం నాయనా, నాన్న గారు కులాసాయేనా. ఒక్కడివే వచ్చినట్టుందే" రమేష్‌నీ చూస్తూనే గుర్తుపట్టిన రాంబాబువాళ్ళ నాన్నగారు సాదరంగా పలకరించేరు.


"కులాసాయేనండీ...అమ్మ కూడా వచ్చేదే-కానీ మా అక్క వచ్చింది స్టేట్స్ నుంచి. తన బలవంతం మీదనే రాజమండ్రి వెళ్ళింది మా మామయ్య దగ్గరికి. నాన్న గారికి కావ్వరెమ్పుంది...మిమ్మల్ని అడిగినట్టు చెప్పమన్నారు. పెళ్ళికి రాలేకపోతున్నందుకు క్షమించమన్నారు." సవినయంగా జవాబిచ్చేడు రమేష్.

"పోన్లే నాయనా- నువ్వొచ్చావుగా-అదే పదివేలు... స్నానం చెయ్యిబాబూ- బాగా అలిసినట్టున్నావు.. వొరేయ్ వీరా- బాబుగారికి నీళ్ళు తోడు. షాంపూ వుంటే సరే- లేకపోతే తీసుకురా- పద నాయనా తర్వాత మాట్లాడు కుందాం. రామూ నువ్వు నాతోరా" అని రాంబాబుతో సహా నిష్క్రమించేడాయన.

స్నానం చేసి బట్టలు మార్చుకొని వస్తున్న రమేష్‌కి కాఫీ గ్లాసందించింది వొకావిడ.

"నువ్వే నా బాబూ డాక్టరీ చదువుతున్న చలపతి గారబ్బాయివి"-

"అవునండీ-మీరూ..." ఆవిడ ఎవరో తెలియక




పోవడంచేత బాధపడ్డాడు రమేష్.

"నేనూ, రాంబాబు మేనత్తనిలే...నా కూతుర్నే చేసుకోవల్సింది వాడు...ఎందుకో వద్దనేశాడు. ఆ గొడవంతా ఎందుకులేగానీ-ఈ మధ్య వారం రోజుల్నించీ, తలా, పళ్ళూ, కళ్ళూ, కాళ్ళూ ఒహటేవిటీ- అస్తమానూ అన్నీ పీకేస్తున్నయ్ నాయనా- కాస్త నీకు తెల్సిన మందులో రెండు చెప్పి పుణ్యం కట్టుకోబాబూ- ఏదీ-డాక్టరికి చూపించుకుందామంటే కుదిరిచావడం లేదు.. దేవుళ్ళా నువ్వే వచ్చావుగనక అడుగుతున్నా-పెద్దదాన్ని ఏమీ అనుకోకు బాబూ. సరేగానీ పంచదార సరిపోయిందా- మరికాస్త వెయ్యనా..."

ఈ అనుభవం కొత్తకాదు రమేష్‌కి. తను తర్డియర్లో వున్నప్పట్నుంచే ఇలా ఎవరింటికైనా వెళ్తే - వాళ్ళ మాటల సందర్భంలో ఎక్కడో చోట ఇలా తమకేమైనా మందులు ప్రిస్క్రైబ్ వెయ్యమనడం- తనో పెద్ద డాక్టర్‌లా ఫోజుతో రాసివ్వడం, మళ్ళీ వాళ్ళు కనబడే దాకా ఆ మందులు సరిగ్గా పనిచేసేయో లేదోనని మధనపడ్డం అలవాటయింది. సాధారణంగా అతడు వ్రాసినవన్నీ పనిచేస్తూనే వుండేవి. ఆవిణ్ని కొన్ని వివరా లడిగి, ఓ పేపర్ మీద-ఒక టానిక్కూ, రెండు రకాల విటమిన్ మాత్రలూ వ్రాసిచ్చేడు. "నీ కడుపు చల్లగా నూరేళ్ళూ బ్రతుకు నాయనా.." అంటూ దీవించి పందిట్లో కల్సిపోయిందావిడ.

తర్వాత ముప్పావుగంట వ్యవధిలో మరో ముగ్గురికి కూడా ఇలాగే మందులు రాసిచ్చేడు రమేష్.

ఇంతలో రాంబాబు వచ్చి భోజనానికి తీస్కెళ్ళేడు రమేష్‌ని.

విశాలమైన ఆ డాబా మీద టార్పాలిన్లు వేసి, ఆరు వరసల్లో విస్తళ్ళు పరిచేరు. చాలా మంది అప్పుడే కూర్చోబోతున్నారు.

హఠాత్తుగా రమేష్ కళ్ళముందో మెరుపు మెరిసింది.

ఆ పచ్చని పసిమి ఛాయ- గోదావరి మీద ప్రతిఫలించే సాయంకాలపు నీరెండ అయితే-ఆ నల్లని జుత్తు పాపి కొండల మీద నుంచీ బద్ధకంగా దొర్లే కారు మబ్బులవి-వెన్నెల వెన్నలా చిక్కగా కురుస్తుంటే, చిన్న చిన్న అలలకింద నుంచీ తళుక్కున మెరిసే చేపల్లాంటివైతే ఆ కళ్ళు, ఆ ముక్కు రెక్కలు విడని గులాబి మొగ్గ...

'ఎంత ఒద్దిగ్గా వుందీ-ఎంత హోమ్లీ గా వుందీ- అనుకున్నాడు రమేష్. ఆ పిల్ల తనకేసే నడిచివొస్తుంటే "నీ పేరు హంస కదా!" అందామనుకున్నాడు. ఆ ఎర్రని లేత పెదవులు చూసి, "నాకు దొండకాయ కూరొద్దు" అందామనుకున్నాడు. కానీ-

రమేష్ ముందున్న ఖాళీ విస్తరిని చివ్వున తీసేసి, వడివడిగా క్రిందకు వెళ్ళిపోయిందామె. ఆశ్చర్యపోవడం, తప్ప ఏమీ చెయ్యలేకపోయాడు రమేష్.

వెంటనే తిరిగొచ్చిందామె...

అయితే ఈ సారి ఆమె చేతిలో శుభ్రంగా కడిగిన పెద్ద విస్తరి వుంది. నూటిగా దాన్ని తెచ్చి అతని ముందు పరిచి, గ్లాసులో నీళ్ళు పోస్తూ కనీకనపడనట్టు చిర్నవ్వొకటి రమేష్ గుండెలోకి విసిరి - సాగిపోయింది.

గట్టిగా విజిలెయ్యబోయి- తమాయించుకుని-ఆమే మళ్ళీ నెయ్యితెచ్చినప్పుడు అలా చెయ్యిపట్టి వుంచేడు ఆ పెద్ద పెద్ద కళ్ళలో దేన్నో వెతుకుతున్నట్టు చూస్తూ... విస్తట్లో అన్నమంతా తడిసి మోపెడయ్యేదాకా అలా నెయ్యి పోస్తూనే వుందా పిల్ల- నవ్వుని పెదవి చివర నిలబెట్టి. నాలుగప్పడాలు నేతిలో ముంచి తెచ్చి రమేష్ విస్తట్లో వేసింది-ఆ బంతిలో.

అందరికీ రెండు ఆవడలూ-రమేష్‌కి మూడు.

అందరికీ ఒక జాంగ్రీ-రమేష్‌కి రెండు.

ఎవరికీ లేని (సాంబార్లో) ములక్కాడ ముక్కలు నాలుగైదూ-ప్లస్ తెల్లని పలువరుస కనీకన్పడనట్లు వడ్డించే చిర్నవ్వులూ-

రమేష్ బొజ్జతోపాటు ఛాతీ కూడా పుబ్బుతోంది. 'అవును మరి. తను మాత్రం అందగాడు కాదా ఏమిటి? ఆరడుగుల పొడవూ, విశాలమైన ఛాతీ, బలమైన చేతులూ, కాళ్ళూ- ఆరోగ్యం వుట్టిపడే కళ్ళూ, చక్కని నొక్కుల తలకట్టూ, తీరైన మీసకట్టూ వున్న మగాళ్ళని అందగాళ్ళనే అంటారు.

'పైగా తనో-కాబోయే డాక్టర్...'

ఆ పిల్ల తనమీద కనబరిచే శ్రద్ధకి కారణం వూహించకపోలేదు రమేష్...

* * *

రాత్రి తొమ్మిది గంటలు కావొస్తోంది.

ముహూర్తం మూడింటికి కదా అని కొంతమంది సెకండ్‌షోలకి వెళ్ళేరు. మరి కొందరు పేకాడుతున్నారు. పిల్లలు మాత్రం పగలంతా ఆడిన ఆటల వలన అలిసి పోయి వొళ్ళెరగకుండా పడినిద్రపోతున్నారు.

మేడ మెట్ల పక్కనే అరుగుమీద –

– ఇర్వింగ్ వాలెస్ "ది ఫస్ట్ లేడీ" చదువుతూ- కుర్చీలోనే కునుకుతున్నాడు రమేష్ కాళ్ళు బారచాపుకుని. ధ్యాస పుస్తకమ్మీద లేనేలేదు. మనసంతా ఆమె చుట్టూ పరిభ్రమిస్తోంది. ఈ పది గంటలలోనూ-పది వందలసార్లు ఇద్దరి కళ్ళూ కలుసుకున్నయ్యి...కబుర్లు చెప్పుకున్నయ్యి...ఇంకేం కావాలి?

'తను ఎన్నాళ్ళ నుంచో ఆరాధిస్తున్న ఊహాసుందరి ఈమే...నిశ్చయంగా ఈమే......అదిగో...ఇటే వస్తోంది. ఏదో పని వున్నట్టు హడావుడిగా వస్తోంది... చేతిలో ఏమిటి..తాంబూలం..తన పెదవులు తాంబూలంతో మరింత ఎర్రబడ్డవి కదూ....'

కుర్చీ చేతిమీద కిళ్ళీ వుంచి, 'పైకి రమ్మ'న్నట్టు కళ్ళతోనే సూచించి-మెల్లెక్కి పైకివెళ్ళిందామె......

రమేష్ గుండె ఫ్రీజయింది.

వెంటనే తేరుకుని, మెల్లిగా లేచి మెట్లు ఎక్కసాగేడు.

అతన్నెవరూ పట్టించుకోలేదు.

వొళ్ళు దూదిపింజలా అయిన భావన...ఆమె తన కుర్చీ పక్కన ఆగినప్పుడు, ఆమె నుంచి వీచిన మరువం మల్లెపూల పరిమళం ఇంకా వదల్లేదు...పసి నిమ్మపండులాంటి ఆమె వొంటి ఛాయ గుర్తురాగానే-అంత చలిలోనూ వొళ్ళు వేడెక్కడం తెలుస్తోంది.

శీతాకాలం...వెన్నెల తప్ప ఏమీ లేదు ఆకాశంలో... ఆమె మెడ వొంపులో మెరుస్తున్న వెన్నెల తప్ప యేమీ లేదు రమేష్ చూపులో...

పిట్టగోడకి ఆనుకుని...తలవొంచుకుని... ఆమె......

'ఇన్నాళ్ళకి కరుణించావా దేవీ' అన్నట్టు ఆప్యాయతా, ఆరాధనా నింపుకున్న కళ్ళతో-ఆమెని తాగేసేలా చూస్తూ-ఆమెకి జానెడు దూరంలో నిల్చొని రమేష్...

ఇద్దరి మధ్యా సముద్రమంత నిశ్శబ్దం...

మెల్లిగా తలయెత్తిందామె.

రెండు క్షణాలు తదేకంగా రమేష్ కళ్ళలోకి చూసింది.

గుటకెయ్యడానిక్కూడా గొంతులో తడిలేదు రమేష్‌కి..

పగడాల్లాంటి ఆ లేత పెదవులు విడివడి......

"నా...న......న్నత్తి కేమైనా మ......మ్మందుందేమో చె......చ్చెప్పరూ......"